ఎందుకీ కష్టాలిచ్చావు బాబూ..!

- ఇంటికే పింఛను తెచ్చి ఇచ్చేవాళ్లు..
- మండుటెండలో అవ్వాతాతలకు తప్పని పాట్లు

కొత్తపేట: వలంటీర్ల సాయంతో ప్రతి నెలా ఒకటో తేదీన ఇంటి వద్దే పింఛన్లు పొందే లబ్ధిదారులపై టీడీపీ కక్ష కట్టింది. ఓట్ల రాజకీయంతో చంద్రబాబు పుణ్యమా అని పింఛను కోసం పండుటాకులు సచివాలయాలకు రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం వేసవి ఉష్ణోగ్రతలు తీవ్ర స్థాయికి చేరుకున్న తరుణంలో పింఛనుదారులు ముఖ్యంగా వృద్ధుల బాధలు వర్ణనాతీతం. విధిలేని పరిస్థితుల్లో ఎండ తీవ్రత.. వ్యయ, ప్రయాసలతో బతుకు జీవుడా అంటూ సచివాయాలకు వస్తున్నారు. సచివాలయ సిబ్బంది వారిని కూర్చోపెట్టి, మంచినీరు తాగండంటూ సేవలందించి, పింఛను ఇచ్చి పంపిస్తున్నారు. కొత్తపేట సచివాలయం వద్ద కొందరు పింఛనుదారుల పరిస్థితి ఇదీ..

అతి కష్టంగా పింఛను కోసం..

కొత్తపేట కొప్పిశెట్టివారి వీధికి చెందిన కుడిపూడి కృష్ణవేణి వృద్ధాప్య పింఛను లబ్ధిదారు. అతి కష్టం మీద కుటుంబ సభ్యుని సాయంతో కొత్తపేట సచివాయానికి వచ్చి పింఛను తీసుకుంది. ప్రతి నెలా ఒకటో తేదీనే కడుపులో నీళ్లు కదలకుండా వలంటీర్ ఇంటికే తెచ్చి పింఛను డబ్బులు ఇచ్చేదని, ఈ నెల ఇక్కడికి వచ్చి తీసుకోవాల్సి వచ్చిందని పేర్కొంది.


కొత్తపేట సచివాలయానికి పింఛను కోసం వస్తున్న పెదసత్యనారాయణ


కొత్తపేట సచివాలయానికి వచ్చి.. పింఛను తీసుకుని వెళ్తున్న నాగరత్నం

ఎవరు అడ్డుపడ్డారో కానీ..

తన తమ్ముని కుమారుడి సాయంతో కొత్తపేట సచివాలయానికి పింఛను కోసం వచ్చాడు అంబటి పెదసత్యనారాయణ. పుట్టుకతో మూగవాడైన అతను దివ్యాంగ పింఛనుదారుడు. ప్రతి నెలా ఇంటి పట్టునే పింఛను తీసుకునేవాడు. ఏ మహానుభావుడు అడ్డుపడ్డాడో కానీ ఈసారి ఇక్కడికి రావాల్సివచ్చిందని బాధపడ్డాడు.

ఇన్నాళ్లూ ఇంటికే వచ్చేది..

కొత్తపేట గ్రామానికి చెందిన గోదాశి నాగరత్నం తన ఇంటికి సమీపంలోనే ఉన్న మరో పింఛను లబ్ధిదారు సాయంతో మండుటెండలో పింఛను తీసుకోవడానికి వచ్చింది. ఆమెను చూస్తే అక్కడున్న వారి గుండె తరుక్కుపోయింది. అడుగు ముందుకు వేయలేని పరిస్థితిలో వచ్చిన ఆమెను సచివాలయ సిబ్బంది కుర్చీలో కూర్చోపెట్టి, మంచినీరిచ్చి, కొంతసేపు సేద తీరాక పింఛను ఇచ్చారు. ముఖ్యమంత్రి జగన్ బాబు పుణ్యమా ఇన్నాళ్లూ పింఛను ఇంటికే తెచ్చి ఇచ్చేటోళ్లు. ఈసారి ఇక్కడికి రావాల్సివచ్చిందని వాపోయింది.

పండుటాకుల పడిగాపులు

ఆలమూరు: టీడీపీ. జనసేన పార్టీలు అవలంభిస్తున్న కుట్ర పూరిత వైఖరితో సామాజిక పింఛన్ల కోసం గ్రామ పంచాయతీల వద్ద పండుటాకులు పడిగాపులు పడవలసిన పరిస్థితి ఏర్పడింది. గ్రామ వలంటీర్ల వ్యవస్థను విధుల నుంచి తప్పించడంతో గ్రామ సచివాలయ సిబ్బందితో ప్రభుత్వం పింఛన్లను అందజేస్తోంది. మండలంలోని 18 గ్రామాల్లో 11,232 మంది లబ్ధిదారులకు రూ.3.29 కోట్లు పంపిణీ చేయాల్సి ఉంది. గత రెండు రోజుల్లో ఇప్పటి వరకూ 75 శాతం మేర 8,903 మందికి రూ 2.67 కోట్లు పంపిణీ చేసినట్టు ఎంపీడీఓ ఏ మేరీ రోజ్ తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వృద్ధులు, వికలాంగులు, మంచం పట్టిన వారికి ఇంటి వద్దకు వెళ్లి పింఛను అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

60 శాతం పింఛన్ల పంపిణీ

పి.గన్నవరం: మండలంలోని 23 గ్రామ సచివాలయాల పరిధిలో గురువారం సాయంత్రానికి 60 శాతం మేర పింఛన్లు పంపిణీ చేసినట్టు ఎంపీడీఓ సీహెచ్ త్రిశూలపాణి తెలిపారు. మండలంలో మొత్తం 10,336 మంది పింఛనుదారులు ఉన్నారని చెప్పారు.

పండుటాకులపై ఇంత పగా!?

పింఛన్ల కోసం లబ్ధిదారుల ఉరుకులు పరుగులు

మామిడికుదురు: ప్రతి నెలా ఒకటో తేదీన ఇంటి వద్ద దర్జాగా పింఛను తీసుకునే లబ్ధిదారులు సచివాలయాలకు ఉరుకులు, పరుగులు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీని నిలిపి వేయాలని టీడీపీ, జనసేన, టీడీపీ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడంతో, సచివాలయ ఉద్యోగుల ద్వారా ఆయా సచివాలయాల వద్ద పింఛన్లు పంపిణీ చేయాల్సి వచ్చింది. ఈ చర్యలతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పింఛన్ల పంపిణీలో రెండో రోజు గురువారం వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు అష్టకష్టాలు పడి, పింఛన్ల కోసం సచివాలయాలకు తరలివచ్చారు. క్యూలైన్లలో నిల్చుని పింఛన్లు తీసుకున్నారు. లబ్ధిదారులు ఏవిధమైన ఇబ్బందులకు గురికాకుండా ప్రభుత్వం పక్కాగా ఏర్పాట్లు చేసింది. లబ్ధిదారులకు తాగునీరు అందుబాటులో ఉంచారు. వేసవి తీవ్రత దృష్ట్యా ఎండ బారిన పడకుండా టెంట్లు ఏర్పాటు చేశారు. కూర్చునేందుకు కుర్చీలు సిద్ధం చేశారు. మామిడికుదురు మండలంలోని 18 గ్రామాలు, 22 సచివాలయాల్లో గురువారం నాటికి 65 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేశారు. మొత్తం 9,653 మంది లబ్ధిదారులకు గాను 6,702 మంది పింఛన్లు అందుకున్నారు. జనసేన శ్రేణులు పెదపట్నంలంకలో హడావిడి చేశారు. ఆటోలపై లబ్ధిదారులను ఉచితంగా పంచాయతీ కార్యాలయానికి తీసుకువచ్చారు. దీనిపై వైఎస్సార్ సీపీ నేతలు అభ్యంతరం తెలిపి, అధికారులకు ఫిర్యాదు చేశారు.


వక్కలంకలో పింఛన్ల కోసం వృద్ధులు, దివ్యాంగుల ఎదురుచూపులు


అప్పనపల్లిలో పంచాయతీ కార్యాలయానికి వచ్చిన లబ్ధిదారులు

లబ్ధిదారుల ఆగ్రహం

అంబాజీపేట: నడవలేని, మంచాలకే పరిమితమైన వృద్ధులు, దివ్యాంగులపై ఇంత కఠినంగా వ్యవహరించి పింఛన్ల పంపిణీని టీడీపీ నాయకులు, చంద్రబాబు అడ్డుకోవడం సమంజసమేనా అని పలువురు లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వలంటీర్లతో పింఛను పంపిణీ చేయకుండా అడ్డుకుని, తమను ఇన్ని ఇబ్బందులు గురి చేసిన చంద్రబాబుకు తమ సత్తా ఏమిటో చూపిస్తామన్నారు. బుధవారం నుంచి పింఛన్లు పంపిణీ చేస్తున్నారని తెలుసుకున్న లబ్ధిదారులు.. గురువారం ఉదయమే మండలంలోని ఆయా సచివాలయాల వద్దకు చేరుకుని ఎదురు చూపులు చూశారు. ఒకవైపు ఎండ, మరోవైపు ఉక్కబోతతో మిట్ట మధ్యాహ్నం వరకూ ఇబ్బందులు పడ్డామని, వ్యయ ప్రయాసలకు గురై, పింఛను తీసుకున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

అందరికీ అమ్మవారి ఆశీస్సులు ఉండాలి

ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి


కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

ఆత్రేయపురం: రాజరాజేశ్వరీ అమ్మవారి ఆశీస్సులు గ్రామస్తులందరికీ ఉండాలని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని నార్కెడ్‌మిల్లి గ్రామంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి విరాళం అందించిన దాతలను అభినందించారు. నూతన ఆలయం కారణంగా గ్రామం సుభిక్షంగా ఉంటుందన్నారు. ఉదయం గర్తన్యాసం, రత్నం న్యాసం, పీఠపూజలు, పంచవీర్య, పంచల్ నిక్షేపణ, యంత్రస్థాపన తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. విగ్రహ శిఖర ప్రతిష్ఠ చేసి బూరెలు పోశారు. అనంతరం అన్న ప్రసాదాలను అమ్మవారికి నైవేద్యం చేశారు. సర్పంచ్ పాల నాగేశ్వరరావు, ఎంపీటీసీ పాల వెంకటరమణ, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు యడ్ల శివరామకృష్ణ, శెట్టిబలిజ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా వనువులమ్మ జాతర

మామిడికుదురు: పెదపట్నం గ్రామంలో ఉన్న వనువులమ్మ జాతర మహోత్సవం గురువారం ఘనంగా ప్రారంభమైంది. శనివారం వరకూ మూడు రోజుల పాటు జాతర మహోత్సవం జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది. అమ్మవారి ఆలయం వద్ద చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. విద్యుద్దీపాలతో ఆలయాన్ని ముస్తాబు చేశారు. శుక్రవారం అమ్మవారికి నైవేద్యాలు సమర్పిస్తారని, శనివారం అమ్మవారి తీర్థం, సిరిబొమ్మ ఊరేగింపు జరుగుతుందన్నారు. పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకుని, ముడుపులు, మొక్కుబడులు సమర్పించారు.


పెదపట్నంలోని వనువులమ్మ

మానవతామూర్తుల ఫౌండేషన్‌కు అవార్డు


అవార్డు అందుకుంటున్న బోనం రాజు

మలికిపురం: గోదావరి జిల్లాల పరిధిలో సామాజిక సేవలందిస్తున్న మానవతా మూర్తుల ఫౌండేషన్‌కు న్యూఢిల్లీ కేంద్రంగా ఉన్న ఆదిలీల ఫౌండేషన్ సంస్థ అవార్డు అందజేసింది. సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ ఎస్ ఆదినారాయణ ఆధ్వర్యంలో ఇటీవల గోవాలో ఆదిలీల ఫౌండేషన్–మీడియా హౌస్ సంయుక్తంగా అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించింది. సుమారు 17 రాష్ట్రాల నుంచి వివిధ స్వచ్ఛంద సంస్థలతో పాటు, వివిధ విభాగాల్లో సుమారు 48 మందికి అవార్డులు అందించారు. మానవతామూర్తుల సంస్థ తరపున బోనం రాజు అవార్డు అందుకున్నారు. మానవతా మూర్తులు ఆధ్వర్యంలో సేంద్రియ ఉచిత కాయగూరల విత్తనాల పంపిణీ, ఇతర సేవలను పలువురు ప్రతినిధులు కొనియాడారు.

వైభవంగా పందిరి రాట

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారి పందిరి రాట కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 18 నుంచి వారం రోజుల పాటు కల్యాణోత్సవాలు జరుగుతాయి. దేవాదాయ, ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, ఈఓ భూపతిరాజు కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. శుక్రవారం నుంచి స్వామివారి అధ్యయనోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఈఓ తెలిపారు.

జూదరుల అరెస్టు

పి.గన్నవరం: నాగుల్లంక గ్రామంలో గురువారం పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్టు ఎస్సై బి.శివకృష్ణ తెలిపారు. వారి నుంచి రూ.8200, ఐదు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొత్తపేట: బిళ్లకుర్రు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో ఆర్‌డీఎస్ఎస్ పనుల కోసం బిళ్లకుర్రు, వానపల్లి గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎం.రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పి.గన్నవరం: కొత్తపేట–ముక్కామల 33 కేవీ విద్యుత్ లైన్‌లో నూతన విద్యుదీకరణ పనుల కోసం శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకూ నరేంద్రపురం సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ ఆనందరాజు తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ప్రచార రథాలు సిద్ధం


సిద్ధమైన ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ప్రచార రథం

కొత్తపేట: ఎన్నికల్లో వివిధ రాజకీయ పార్టీల తరఫున ప్రచారం నిర్వహించేందుకు ప్రచార రథాలు సిద్ధమయ్యాయి. వివిధ వాహనాలకు ఆయా పార్టీల అధినేతలు, పార్లమెంట్, అసెంబ్లీ అభ్యర్థుల ఫొటోలు, ఆయా పార్టీల గుర్తుల చిత్రాలు, కటౌట్లతో రూపుదిద్దుకుంటున్నాయి. కొత్తపేట మండలం మోడేకుర్రు శివారు గొలోటివారిపాలెం గ్రామానికి చెందిన గొలకోటి మాధవరావు అనే కళాకారుడు సుమారు ఏడేళ్లుగా మాధవ్ ఫన్నీ కాస్ట్యూమ్స్ పేరుతో వివిధ కార్యక్రమాలకు గుర్రపు బండి, పల్లకీలు, సెట్టింగులు తయారు చేస్తుంటారు. ఎన్నికలకు ప్రచార రథాలనూ తయారుచేస్తున్నారు. అత్యధికంగా వైఎస్సార్ సీపీ ప్రచార రథాలకు ఆర్డర్లు వచ్చినట్టు మాధవరావు తెలిపారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, వైఎస్సార్ సీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రాలున్న కటౌట్లతో పాటు, ఆయా నియోజకవర్గాల ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల కటౌట్లను అమర్చారు. కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ప్రచార రథాలూ సిద్ధమయ్యాయి. వ్యాన్లతో ఏర్పాటు చేసిన ప్రచార రథాలు ఆకర్షణీయంగా తయారయ్యాయి.

సీనియర్ సివిల్ జడ్జిల బదిలీ

కాకినాడ లీగల్: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పలువురు సీనియర్ సివిల్ జడ్జిలను బదిలీ చేస్తూ హైకోర్టు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. వివరాల్లోకి వెళ్తే.. అమలాపురం సీనియర్ సివిల్ జడ్జి కె.శైలజను కాకినాడ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా నియమించారు. ఆమె స్థానంలో విశాఖజిల్లా ఎలమంచిలి సీనియర్ సివిల్ జడ్జి ఎ.సాయికుమారిని నియమించారు. అలాగే కొత్తపేట సీనియర్ సివిల్ జడ్జిగా గుంటూరు రెండో అదనపు సీనియర్ సివిల్ జడ్జి పి.రామారెడ్డి నియమితులయ్యారు.

కొనసాగుతున్న వలంటీర్ల రాజీనామాలు


గోపాలపురంలో చిర్ల జగ్గిరెడ్డిని కలిసిన.. రాజీనామా చేసిన జొన్నాడ వలంటీర్లు, ఇతర నాయకులు

రావులపాలెం: జగనన్నను, జగ్గిరెడ్డి అన్నను గెలిపించుకోవడమే మా ధ్యేయం అంటూ ఆలమూరు మండలం జొన్నాడ గ్రామానికి చెందిన మొత్తం 39 మంది వలంటీర్లు, రావులపాలెం మండలం ముమ్మిడివరప్పాడు గ్రామానికి చెందిన చదలవాడ శిరీష రాజీనామా చేశారు. గురువారం కొత్తపేట నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డిని రావులపాలెం మండలం గోపాలపురం గ్రామంలోని స్వగృహం వద్ద వారు కలిశారు. జగ్గిరెడ్డి, జగనన్న గెలుపు కోసం కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా వలంటీర్ చాపల సురేష్ మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో వలంటీర్ల ద్వారా ప్రతి పథకం లబ్ధిదారుల ఇంటి వద్దకే అందించామన్నారు. ఉన్నత వర్గాల వారికి కూడా ప్రభుత్వ కార్యాలయాల్లో ఏ అవసరం ఉన్నా సహాయపడ్డామన్నారు. చంద్రబాబు చర్యలతో నేడు పింఛను లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారన్నారు. ఎలక్షన్ కోడ్ ఉండగా మమ్మల్ని మీరేం చెయ్యలేరని బెదిరించేవారని, ఇప్పుడు రాజీనామా చేసి ప్రజల్లోకి వెళ్లి వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి చిర్ల జగ్గిరెడ్డి, జగనన్న గెలుపునకు కృషి చేస్తామన్నారు. నియోజకవర్గంలో మరింతమంది రాజీనామాలు చేయనున్నారన్నారు. పొత్తు పార్టీలు తుడిచిపెట్టుకుపోతాయన్నారు. ఈ సందర్భంగా చిర్ల జగ్గిరెడ్డి మాట్లాడుతూ ఐదేళ్లుగా ప్రభుత్వం తరఫున ప్రజలకు సేవ చేసి, ఇప్పుడు తమ గెలుపునకు కృషి చెయ్యడానికి సిద్ధమైన వలంటీర్లకు కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచ్ కట్టా శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు ద్వారంపూడి సత్యనారాయణ రెడ్డి (దొరబాబు), వైస్ ప్రెసిడెంట్ నాంద్ర నాగమోహనరెడ్డి, కట్టా రామకష్ణ, తాడి మెహర్ ఆదిత్యరెడ్డి, గొలుగూరి సూర్రెడ్డి, బొడ్డు సాయికుమార్ గుప్తా, కోమలి శ్రీను, బాలిన సూరయ్య, నక్కా రాజేష్, జక్కాల చిట్టిబాబు, వెలగల మౌళిప్రకాష్ రెడ్డి, సత్తి ప్రదీప్ రెడ్డి తదితరులు ఉన్నారు.

సంక్షేమ పాలనకు జగన్ బాటలు

వైఎస్సార్ సీపీ రాజోలు అసెంబ్లీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు

రాజోలు: రాష్ట్రంలో సంక్షేమ పాలనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాటలు వేశారని రాజోలు అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. గురువారం కాట్రేనిపాడులో గ్రామ శాఖ అధ్యక్షుడు పైడిపర్తి రామారావు అధ్యక్షతన జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామానికి విచ్చేసిన గొల్లపల్లికి స్థానిక నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి గొల్లపల్లి పూలమాల వేసి, నివాళులర్పించారు. రాజ్యాంగంలో అంబేడ్కర్ పొందుపరిచిన సామాజిక న్యాయాన్ని రాష్ట్రంలో అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థులుగా పోటీ చేసేందుకు అత్యంత ప్రాధాన్యమిచ్చారన్నారు. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు నేరుగా అందించారని, మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డినే కోరుకుంటున్నారన్నారు. అదే ఉత్సాహంతో రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని విజయ పథంలో నిలపాలన్నారు. ఏఎంసీ చైర్మన్ గుబ్బల రోజారమణి, జెడ్పీటీసీ మట్టా శైలజ, ఏఎంసీ వైస్ చైర్మన్ సుంకర బాబ్జి, ఏఎంసీ సభ్యుడు సాధనాల రంగా, సొసైటీ చైర్మన్ అడబాల రామప్రసాద్, నాయకులు పైడిపర్తి వెంకటరత్నాజీ, కొంబత్తుల ప్రసాద్, దీపాటి మున్నా, ఏడిద నాగులు, కొంబత్తుల రమణ, కాటాడి ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


చింతలమోరిలో పింఛను లబ్ధిదారులతో గొల్లపల్లి సూర్యారావు

ప్రతిపక్షాలతో సంక్షేమానికి విఘాతం

మలికిపురం: రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరలా ముఖ్యమంత్రి అయితేనే ప్రజలకు ఇపుడున్న సంక్షేమ పథకాలు కొనసాగుతాయని, ప్రతిపక్షాలు అధికారంలోకి వస్తే ఇవన్నీ రద్దు చేస్తారని గొల్లపల్లి సూర్యారావు అన్నారు. చింతలమోరి గ్రామంలో గురువారం జరిగిన వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిలకడ లేని చంద్రబాబును నమ్మి వెళ్లిన ఏ స్థాయి నాయకుడినైనా నిలువునా ముంచేస్తాడన్నారు. ఎన్నికల కోడ్ పేరుతో పేదల పింఛన్లను చంద్రబాబు అడ్డుకున్నారని మండిపడ్డారు. గ్రామంలో పింఛన్లు పొందుతున్న మహిళల సమస్యలను తెలుసుకున్నారు. ఎంపీటీసీ తోటి రాజేష్, సొసైటీ చైర్మన్ మోకా భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.


కాట్రేనిపాడు సమావేశంలో మాట్లాడుతున్న గొల్లపల్లి

జగన్‌పైనే సంపూర్ణ విశ్వాసం


కొత్తపేటలో వైఎస్సార్ సీపీలో చేరిన నాయకులకు పార్టీ కండువాలు వేస్తున్న జగ్గిరెడ్డి

- టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరిన శెట్టిబలిజ నేతలు
- సాదరంగా ఆహ్వానించిన ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

కొత్తపేట: పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై తమకు సంపూర్ణ విశ్వాసం ఉన్నట్టు స్థానిక ఏనుగుల మహల్ గ్రామానికి చెందిన శెట్టిబలిజ సామాజికవర్గ నేతలు స్పష్టం చేశారు. టీడీపీకి చెందిన గ్రామ శెట్టిబలిజ నాయకులు, కార్యకర్తలు మూకుమ్మడిగా ఆ పార్టీకి రాజీనామా చేసి, బుధవారం రాత్రి వైఎస్సార్ సీపీలో చేరారు. ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి సమక్షంలో వారు మాట్లాడుతూ జన్మభూమి కమిటీల పేరుతో ప్రజలను పీక్కుతిన్న పార్టీ, పొత్తుల పార్టీలు తమకొద్దని పేర్కొన్నారు. ఆ పార్టీని నమ్మి మరోసారి మోసపోవడానికి సిద్ధంగా లేమన్నారు. ఏ పార్టీ అని చూడకుండా, అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేసిన జగన్ ప్రభుత్వమే కావాలని, నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న చిర్ల జగ్గిరెడ్డి మళ్లీ ఎమ్మెల్యేగా గెలవాలని ఆకాంక్షించారు. ఏ విధమైన ప్రయోజనం లేని టీడీపీలో కొనసాగే కంటే, ప్రజా ప్రయోజనాలు కాపాడే వైఎస్సార్ సీపీకి మద్దతుగా నిలవాలని తీర్మానించుకున్నామన్నారు. పార్టీలో చేరిన వాసంశెట్టి వెంకన్న, సూరంపూడి గోవిందు, లచ్చన్న, వాసంశెట్టి నాగన్న, నాగరాజు, చిన్న, కుడుపూడి గంగరాజు, సురేష్, గుత్తుల శేఖర్, రెడ్డి రమణ, గుత్తుల వీరాస్వామి, కుడుపూడి మాణిక్యం, రెడ్డి మారమ్మ తదితర సుమారు 50 మందికి ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా జగ్గిరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై, తనపై విశ్వాసంతో పార్టీలో చేరడం తనకు కొండంత అండ అని అన్నారు. ఈ కార్యక్రమంలో అవిడి సర్పంచ్ రెడ్డి చంటి, మందపల్లి వీడీసీ కన్వీనర్ సాదు చెంచయ్య, పార్టీ నాయకులు సలాది బాబ్జి, తోరాటి గణేష్, గ్రంధి చంద్రరావు, ఏడుకొండలు, గోవిందు, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటేసి మళ్లీ గెలిపించండి

పి.గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు

అంబాజీపేట: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆశీర్వదించి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని పార్టీ పి.గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు విజ్ఞప్తి చేశారు. ముక్కామల, ఇరుసుమండ గ్రామాల్లో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్ ఆధ్వర్యంలో గురువారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, అమలాపురం ఎంపీ అభ్యర్థిగా రాపాక వరప్రసాదరావును ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని ఇంటింటికీ వెళ్లి వేణుగోపాలరావు కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ అందించిన సంక్షేమ పథకాలు ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాయన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసి తన విశ్వసనీయతను చాటుకున్నారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి ఇంటిలోనూ సంక్షేమ పథకాల లబ్ధిదారులు ఉన్నారన్నారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపైనా ఉందన్నారు. వలంటీర్లను చూస్తే చంద్రబాబుకు వణుకు పుడుతోందని విమర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి వేణుగోపాలరావుకు మహిళలు హారతులిచ్చి ఘనంగా సత్కరించారు. రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి నేలపూడి స్టాలిన్‌బాబు, ఉభయ గోదావరి జిల్లాల గ్రీవెన్స్ కన్వీనర్ పేరి శ్రీనివాస్, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీలు బూడిద వరలక్ష్మి, గన్నవరపు శ్రీనివాసరావు, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, ఎంపీటీసీలు వనచర్ల కనకదుర్గ, బుడితి సత్యనారాయణమ్మ, బండారు మల్లి, నాగాబత్తుల సత్యానందం, గుబ్బల మహేష్, దేవరపల్లి చినబాలయోగి, దొమ్మేటి రాధా సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


ముక్కామలలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న విప్పర్తి వేణుగోపాలరావు

జిల్లాలో 81.7 శాతం పింఛను పంపిణీ పూర్తి

అంబాజీపేట: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఇప్పటి వరకు 81.7 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయిందని డీపీఓ దుండి రాంబాబు తెలిపారు. గంగలకుర్రు అగ్రహారం, గంగలకుర్రు, మాచవరం గ్రామాల్లో సచివాలయాల వద్ద జరుగుతున్న పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న 385 పంచాయతీల పరిధిలో 542 కేంద్రాల్లో సచివాలయ, పంచాయతీ ఉద్యోగులతో పింఛన్ పంపిణీ చేస్తున్నామన్నారు. జిల్లాలో 2,45,477 పింఛన్లు ఉన్నాయన్నారు. మంచానికే పరిమితమైన పింఛన్ దారులకు ఇంటింటికీ వెళ్లి అందించాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. పింఛన్ పంపిణీ చేసే కేంద్రాల వద్ద టెంట్, విద్యుత్, తాగునీరు, వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. త్వరితగతిన పింఛన్ పంపిణీ పూర్తి చేసేలా చూడాలన్నారు. పింఛన్ తీసుకునేందుకు వచ్చిన వృద్ధులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. డీపీఓ వెంట పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.


గంగలకుర్రులో లబ్ధిదారులకు పింఛను పంపిణీ చేస్తున్న డీపీఓ రాంబాబు